క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తికి మద్దతుగా ప్రచారం



కపిలేశ్వరపురం ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రసాద్

కపిలేశ్వరపురం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం తదితర పాఠశాలల్లో శనివారం ఆయన ఉపాధ్యాయులను కలసి పీడీఎఫ్ తరఫున ఓటు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌లను నిలిపివేయాలని, జీవో 117ను రద్దు చేయాలని, పాఠశాలల నిర్వహణలో పనిభారాన్ని పెంచుతున్న యాప్‌లను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అగస్త్యేశ్వరస్వామికి అన్నాభిషేకం



అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

రామచంద్రపురం: పట్టణంలో వేంచేసిన బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామికి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం అన్నాభిషేకం నిర్వహించారు. కేవీ ఆర్ హాస్పిటల్ అధినేత కోట వెంకట రమణ మూర్తి-వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో చెరుకుపల్లి గణేష్ శర్మ బ్రహ్మత్వంలో, చీమలకొండ వినోద్ శర్మ, మద్దిరాల శ్రీనివాస దత్తు, ఆలయ అర్చకులు కొత్తలంక ఎర్రయ్య శాస్త్రి, స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకాన్ని జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. స్వామికి అభిషేకించిన అన్నాన్ని అన్నప్రసాదంగా భక్తులకి అందించారు.

పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, ఆహారం పొట్లాలు



పేదలకు దుప్పట్లు, పండ్లు అందజేస్తున్న డొక్కా సీతమ్మ అన్నదాన ట్రస్టు సభ్యులు

రాయవరం: వెదురుపాకలో డొక్కా సీతమ్మ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం సుమారు 100 మంది పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, ఆహారపొట్లాలు అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు తాడి బుల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ డొక్కా సీతమ్మ అన్నదాన ట్రస్టు ద్వారా కార్తికమాసం నెల రోజులూ పేదలకు భోజనం ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి సోమవారం పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని గ్రామంలో 100 మందికి దుప్పట్లు, పండ్లు, భోజనం పొట్లాలను గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అందజేసినట్లు తెలియజేశారు. గ్రామంలో మంచి సేవా కార్యక్రమాలు తలపెట్టిన అన్నదానం ట్రస్ట్ అధ్యక్షులు తాడి బుల్లి వెంకటరెడ్డిని, ట్రస్ట్ సభ్యులను సర్పంచ్ పెద్దబ్బాయి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని పేదలకు ఆహార పొట్లాలను స్వయంగా అందజేశారు.

దివ్యాంగులను తప్పుదోవ పట్టిస్తున్నారు



ఖండవిల్లి భరత్ కుమార్

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొందరు వ్యక్తులు దివ్యాంగులను తప్పుదోవ పట్టిస్తున్నారని అఖిల భారత దివ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే సభలో ఒక పార్టీ సభ్యత్వం తీసుకుంటే సంక్షేమ పథకాలు అందుతాయనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీన్ని మానుకోవాలని, లేకుంటే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. పార్టీ పరంగా చేయాల్సిన కార్యక్రమాన్ని దివ్యాంగుల పేరు చెప్పి చేయడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. ఇటువంటి ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

విద్యార్థులకు నాసా కిట్ల అందజేత

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ చైతన్య పాఠశాలలో శనివారం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే నాసా కాంటెస్ట్‌కు ఎంపికైన ఏడుగురు విద్యార్థులకు ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని వాడ్రేవు రత్న పద్మావతి ఆధ్వర్యంలో నాసా కిట్లు అందజేశారు. హెచ్ఎం పద్మావతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించే ఇటువంటి పరీక్షలకు విద్యార్థులను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.లీలా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక విద్య స్థాయి నుంచే విద్యార్థులు తమలోని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రైమరీ ఇంచార్జి నీలిమ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి సుమతి, డీన్ దుర్గారావు, ఏఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ఆధార్ నవీకరణ

- ముగిసిన ఆధార్ శిబిరాలు
- రెండు నియోజకవర్గాల్లో 51 మందికి కొత్తగా ఆధార్ నమోదు
- 447 మంది ఆధార్ వివరాల అప్‌గ్రేడ్
- మొత్తం 498 మందికి సేవలు



అంగర శిబిరంలో విద్యార్థిని వివరాలు నవీకరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్

కపిలేశ్వరపురం: ప్రభుత్వం ఏదైనా తలపెడితే ఆ నిర్ణయం కార్యరూపం దాల్చేందుకు క్షేత్ర స్థాయిలో అందుకు అనుగుణమైన వ్యవస్థ ఉండాలి. 2019కు ముందు ఆంధ్ర ప్రదేశ్‌లో ఒక్కో పంచాయతీ పరిధిలోని గ్రామాలకు ఒక్కో ఆఫీసు ఉండేది. మిగిలిన ప్రభుత్వ కార్యకలాపాలన్నీ మండల కేంద్రంలోనే జరిగేవి. ప్రజలు నానా యాతన పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. పరిమితికి మించి జనాభా గల గ్రామాల్లో రెండు చొప్పున సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఒక్కో సచివాలయంలో సుమారుగా 10 మంది చొప్పున వివిధ శాఖల ఉద్యోగులను నియమించింది. అంతటి గొప్ప వ్యవస్థ భారతదేశంలో మరెక్కడా లేకపోవడం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకొంది. అలా ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ప్రతి కార్యాచరణకూ ఉపకరిస్తోంది. అందుకు ఉదాహరణగా ఇటీవల నిర్వహించిన ఆధార్ నవీకరణ శిబిరాలే నిదర్శనం.

శిబిరాల నిర్వహణ లక్ష్యం ఇదీ...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన శిబిరాల్లో విద్యార్థుల ఆధార్ వివరాలను నవీకరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలోని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు నవీకరణ ప్రక్రియలో శ్రమించారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ జారీ చేయాలన్న నిర్ణయంలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల ఆధారంగా ఆధార్ కార్డు ఉండాలన్న లక్ష్యంతో శిబిరాలను నిర్వహించి వివరాలు సరిచేశారు. విద్యాపరమైన అంశాల్లో ప్రభుత్వ లబ్ధిని పొందేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ దోహద పడుతుంది. ఈనెల 8 నుంచి 29 వరకూ శిబిరాలు కొనసాగాయి.

నవీకరణ ప్రక్రియ ఇలా...

మండపేట పట్టణంలో1 సచివాలయం, రూరల్ గ్రామాల్లో రెండు, కపిలేశ్వరపురం మండలంలో మూడు, రాయవరం మండలంలో రెండు మొత్తం 8 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నవీకరణ శిబిరాలు నిర్వహించారు. రామచంద్రపురం పట్టణంలో 1, రూరల్ గ్రామాల్లో రెండు, కె.గంగవరం మండలంలో మూడు మొత్తం ఆరు సచివాలయాల పరిధిలో సిబ్బంది సేవలందించారు. మండపేట నియోజకవర్గంలో 29 మందికి, రామచంద్రపురం నియోజకవర్గంలో 22 మందికి మొత్తం 51 మందికి కొత్తగా ఆధార్ నమోదు చేశారు. ఆధార్‌లో వివరాలు, బయోమెట్రిక్ తదితర నవీకరణలు మండపేట నియోజకవర్గంలో 306 మందికి, రామచంద్రపురం నియోజకవర్గంలో 141 మందికి సేవలందించారు. నవీకరణ శిబిరాల్లో మొత్తం మండపేట నియోజకవర్గంలో 335 మందికి, రామచంద్రపురం నియోజవకర్గంలో 163 మందికి మొత్తం రెండు నియోజకవర్గాల్లో 498 మందికి సేవలందించారు.

రెండు నియోజకవర్గాల్లో నవీకరణ ఇలా...

మండలం	కొత్త ఆధార్ నమోదు	నవీ కరణ	మొత్తం సర్వీసులు
మండపేట అర్బన్	14	50	64
మండపేట రూరల్	06	70	76
రాయవరం	03	59	62
కపిలేశ్వరపురం	06	127	133
ఆర్సీపురం అర్బన్	01	17	18
ఆర్సీపురం రూరల్	08	24	32
కె.గంగవరం	13	100	113
మొత్తం	51	447	498

ఘనంగా వన సమారాధనలు



కె.గంగవరంలో ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం, పామర్రు గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం ఆట పాటలతో గడిపి మధ్యాహ్నం అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసు, పీవీ బ్రహ్మానందం, కె.శ్రీనివాస్, ఏడుకొండలు, రాఘవకుమారి, శ్రావణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పామర్రు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు స్థానికంగా పంట పొలాల వద్ద ఉల్లాసంగా గడిపి అధ్యాపకులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు.

టీచర్లతో మెరుగైన సమాజ నిర్మాణం

ఎమ్మెల్సీ ఐవీ



రాఘవులు దంపతులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: మెరుగైన సమాజ నిర్మాణం ఉపాధ్యాయునితో సాధ్యపడుతుందని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్, వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ డీవీ రాఘవులు ఉద్యోగ విరమణ సందర్భంగా వెదురుమూడిలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక శాస్త్ర అధ్యాపకుడిగా డీవీ రాఘవులు వివిధ పాఠశాలల్లో 1984 నుంచి 40 ఏళ్ల పాటు సేవలందించారు. విద్యాబోధనలో మంచి పేరుతెచ్చుకున్న రాఘవులు ఉపాధ్యాయ సమస్యలను సైతం శాస్త్రీయ కోణంలో అధ్యయనం చేశారు. యూటీఎఫ్ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ గానూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్‌గానూ విశేష సేవలందించారు. ఆయన సేవలను యూటీఎఫ్ పూర్వపు సీనియర్ నాయకులు గారా చిట్టిబాబు, ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు, పలు ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. నమ్రతతో ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన రాఘవులు, కేఎస్ఎం రాణి దంపతులను అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ, నాయకులు పి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు

- ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్
- అంధుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

మండపేట: అంధ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆలమూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని తర్వాణీపేట వీధిలోని ప్రత్యేక ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ అంధుల పాఠశాల, హాస్టల్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అలాగే డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉత్తర్వుల మేరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. పట్టణ ప్రభుత్వాసుపత్రి కంటి వైద్యులు సూరంపూడి సత్యనారాయణ అంధ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో ఒకరికి కంటి చూపు మెరుగుపడుతుందని నిర్ధారించారు. అనంతరం న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్‌ను విద్యార్థులంతా శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందించారు. ఆలమూరు పీఎల్‌వీఎస్, కోర్టు సిబ్బంది, న్యాయవాది పెనుముచ్చి సుకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

రామచంద్రపురం: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంపర్కాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా 18 ఏళ్ల నుంచి 21 ఏళ్ల యువకులకు హెచ్‌ఐవి వ్యాధి సోకుతుందని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలన్నారు. హెచ్‌ఐవీ వైరస్ మన బాడీలోని ఇమ్యూనిటీ పవర్‌ను చంపేస్తుందని అవగాహన కల్పించారు. డాక్టర్ వి.రమణ, సారా, శోభారాణి, సుజాత, బేగం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కాపు కార్తిక వన సమారాధన

మండపేట: కాపు కార్తిక వన సమారాధనను ఆదివారం భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్టు పట్టణ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయి బాబా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఏడిద రోడ్డులోని జొన్నల వెంకటేశ్వర్లు గోదాముల వద్ద శ్రీకృష్ణదేవరాయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి వన సమారాధన జరుగుతుందన్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని, కాపులందరూ కుటుంబ సమేతంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాయిబాబా కోరారు. మండపేట పట్టణంలోని కాపులతో పాటు నియోజవర్గంలోని మూడు మండలాల్లోని కాపులను ఆహ్వానించామన్నారు.

నగదు చోరీ కేసులో మహిళలకు రిమాండ్

మండపేట: నగదు చోరీ కేసులో నిందితులైన ఇద్దరు మహిళలకు ఆలమూరు కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వాకాడకు చెందిన కొమ్మి మణిరత్నం నవంబర్ 28న మండలంలోని ఏడిద మోదుకూరు పుంతరోడ్డులో ఆటోలో ప్రయాణిస్తున్నాడు. గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన అంబటి జ్యోతి, తొండ శాంతి ఆదే ఆటో ఎక్కారు. మోదుకూరు పుంతరోడ్డుకు వచ్చేసరికి మణిరత్నం బ్యాగ్‌లోని రూ.10 వేల నగదును ఆ మహిళలు కాజేశారు. వారిద్దరూ మండపేట బస్‌స్టాండు నుంచి మణిరత్నంను వెంబడించి ప్రయాణికుల మాదిరిగా ఆటో ఎక్కి ఈ దొంగతనానికి పాల్పడ్డారు. దీనిపై ఇప్పనపాడు పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకుని ఆలమూరు కోర్టు జడ్జి ముందు హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ దొరరాజు వివరించారు.

వైభవంగా కార్తిక దీపారాధన



రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో వేంచేసిన అలివేలు మంగాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద 33వ కార్తిక దీపారాధన మహోత్సవం శనివారం ప్రముఖ దాత, వెంకట్వేర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం మేడవరపు శ్రీనివాస చింతామణి, క్లోపల్లి రమేష్‌ల బ్రహ్మత్వంలో సహస్ర తులసి పూజ, సాయంత్రం అఖండ దీపారాధన నిర్వహించారు. అనంతరం బాణసంచా కాల్చారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు గంధం కృష్ణాజీ, కాకిలేటి సూరిబాబు, అన్నాయిపేట సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

← ద్రాక్షారామ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- రహదారుల వెంబడి చెట్ల నరికివేత
- పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు



చెట్లను నరికి తరలించుకుపోతున్న దుండగులను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

కాజులూరు: యానం-ద్వారపూడి రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు, ఉప్పుమిల్లి గ్రామాల సరిహద్దులో దుండగులు తరలించుకుపోతున్న కలపను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించి శనివారం స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుయ్యేరు, ఉప్పుమిల్లి గ్రామాల మధ్య యానం-ద్వారపూడి రహదారికి ఇరువైపులా పలు రకాల చెట్లు దట్టంగా పెరిగి ఉన్నాయి. సుమారు 50 ఏళ్లుగా రోడ్డుకిరువైపులా ఈ చెట్లు ప్రయాణికులకు నీడనిస్తుండటంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. అయితే ఇటీవల కొంత కాలంగా కొందరు వ్యక్తులు ఈ చెట్లను నరికి తరలించుకుపోతున్నారు. ఈ క్రమంలో శనివారం దుండగులు చెట్లను నరికి ట్రాక్టర్‌పై లోడు చేస్తుండగా స్థానికులు నిర్బంధించి రెవెన్యూ, గొల్లపాలెం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ని, చెట్లను నరికివేసిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అయితే చెట్ల నరికివేతపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు సుముదాయించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు అధికారులు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు చెట్లు నరికివేస్తుంటే ప్రయాణికులు అడ్డుకుని ప్రశ్నించినప్పటికీ ఆగంతకులు ఆర్అండ్‌బీ అధికారుల ఆదేశాల మేరకే తొలగిస్తున్నామని చెప్పి తప్పించుకునేవారని నిజనిర్ధారణ కోసం ఆర్అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసినా పట్టించుకునేవారు కాదని, తీరా తామే పట్టుకుని పోలీసులకు అప్పగించామని పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎట్టకేలకు ఆర్అండ్‌బీ సిబ్బంది వచ్చి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. కలపలోడు ట్రాక్టర్‌ను పోలీసులు గొల్లపాలెం స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. కాగా అనుమతి లేకుండా చెట్లు నరికివేస్తున్నట్టు తెలియగానే వచ్చి అక్రమార్కులను పట్టుకుని కేసు నమోదు చేశామని ఆర్అండ్‌బీ జేఈ ప్రసన్న తెలిపారు.

అట్టడుగు వర్గాల కోసమే పరంజ్యోతి పోరాటం



పరంజ్యోతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

రామచంద్రపురం: అట్టడుగు వర్గాల కోసం నిరంతరం పాటు పడ్డ కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి ఆశయ సాధనలో పోరాటాలు ముమ్మరం చేద్దామని సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఎం.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని డాక్టర్ చెలికాని రామారావు భవనంలో శనివారం అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు అధ్యక్షతన కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి వర్ధంతి సభ జరిగింది. ముందుగా కామ్రేడ్ పరంజ్యోతి చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యవక్తలుగా హాజరైన సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.దుర్గాప్రసాద్ భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాఘవులు తదితరులు మాట్లాడుతూ పరంజ్యోతి పీడిత ప్రజల పక్షాన అలుపెరగని పోరాటాలు సాగించారన్నారు. కూలి రేట్ల కోసం భూ పంపిణీ కోసం దళితులపై దాడులకు వ్యతిరేకంగా అనేక పోరాటాల సాగించారని, పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తి అనేక విజయాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న, సత్తిబాబు తదితరులు మాట్లాడారు. ఈ సభలో సంఘ సభ్యులు జె.సత్యవేణి, మడికి దుర్గారావు, పి.గురుమూర్తి, డి.ప్రసాద్, డి.మనోజ్, గణేష్, రాజు, రాంబాబు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



హాజరైన కౌన్సిల్ సభ్యులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం సాదాసీదాగా జరిగింది. చైర్‌పర్సన్ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి పాలక, విపక్షాల సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేవలం అజెండాలో పేర్కొన్న మూడు అంశాలను ఆమోదించి, తొందరగా సమావేశాన్ని ముగించేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో వారికి చెందాల్సిన రాయితీలకు సంబంధించిన అంశాలను మాత్రమే అజెండాకు తీసుకొచ్చి ఆమోదం తెలిపారు. అనంతరం 9వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చుండ్రు సుబ్బారావు చౌదరి మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల పన్నుల భారంతో ప్రజల సతమతం అవుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. ఇంటి పన్నులతో పాటు ఖాళీ స్థలాల పన్నులను కూడా విపరీతంగా పెంచేశారన్నారు. గతంలోనూ ఇలాగే ఆస్తి పన్నుల పెంపు విషయాలను తాము వ్యతిరేకించామని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా వైస్ చైర్మన్ వేగుళ్ల నారాయణరావు(నారయ్య బాబు) పట్టణ సమస్యలను సమావేశంలో చెప్పొచ్చా అని ప్రశ్నించగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, మరుసటి సమావేశం దృష్టికి తీసుకురావచ్చని కమిషనర్ రంగారావు సమాధానమిచ్చారు. దీనిపై నారయ్యబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు లేవనెత్తే అవకాశం లేనప్పుడు సమావేశం ఎందుకని అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, పాలక, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ డీఈ కె. శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ఫెంగల్



మొగలిపాలెంలో వర్షపు జల్లులు పడుతుండటంతో ఆదరాబాదరాగా వరి పడుగు దులుపుతున్న రైతులు

కాజులూరు: బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వరుస తుపాన్లకు రైతులు కలవర పడుతున్నారు. నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా వరుసగా తొలకరి పంట వర్షాల బారిన పడుతూనే ఉంది. సాగు చివరి దశలో సంభవిస్తున్న అల్పపీడనాలు, తుపాన్లు వ్యవసాయదారులకు తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది చేరదు గింజలు అందంగా చేతికి దక్కుతున్నాయని ఆశిస్తున్న రైతన్నను అశనిపాతంలా వర్షాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట మాసూళ్లకు చేరుకున్న చివరి దశలో మంచి దిగుబడికి అనుకూలంగా వాతావరణం ఉందని రైతులు సంతోషిస్తున్న సమయంలో ఏర్పడ్డ పెనుతుపాన్లు నియోజకవర్గ గ్రామాల్లో రైతులను ఆందోళనలోకి నెట్టేసింది. ప్రస్తుతం ఫెంగల్ తుపాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా నియోజకవర్గ గ్రామాల్లో చెదురుమదురుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో మాసూళ్లు నిర్వహించుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 53 వేల ఎకరాలలో సార్వా సాగు చేశారు. సుమారు 60 శాతం రైతులు పంట ఒబ్బిడి చేసుకోగా మరో 40 శాతం పొలాల్లో రైతులు మాసూళ్ల నిర్వహణలోనూ ధాన్యం ఆరబెట్టే పనిలోనూ ఉన్నారు. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడుతుండటంతో మాసూళ్ల దశలో ఉన్న పంటను దక్కించుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. పొలాల్లో ఉన్న వరి పనలను ఒడ్డుపై కళ్లాల్లోకి చేర్చి ఆదరబాదరా మాసూళ్లు నిర్వహించారు. పొలంగట్లపై రాశులుగా ఉంచిన ధాన్యాన్ని రైతులు హడావుడిగా సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. ప్రస్తుత సమయంలో వర్షాలు రైతాంగానికి అన్నివిధాలుగా నష్టాలనే కలగజేస్తాయని రైతులు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరుబాటే శరణ్యం

ఎమ్మెల్సీ ఐవీ, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

రాయవరం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరుబాటే శరణ్యమని, సమస్యల సాధనలో యూటీఎఫ్ ఎన్నడూ ముందుంటుందని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. రాయవరం మండల యూటీఎఫ్ మహాసభను శనివారం పసలపూడిలో మండల శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సభలో ఐవీ, ప్రసాద్ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తూ, ఉపాధ్యాయ సంక్షేమమే ధ్యేయంగా నిర్విరామంగా పని చేస్తున్న ఏకైక యూనియన్ యూటీఎఫ్ మాత్రమేనన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, సీనియర్ నాయకులు గారా చిట్టిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు గరగ సీతాదేవి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి జి.మురళీకృష్ణ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది సభ్యులను కలిగి ఉన్న యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎన్నడూ వెనుకంజ వేయలేదన్నారు. యూటీఎఫ్ పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.రాజు, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, మండల శాఖ కార్యదర్శి జి.మురళీకృష్ణ, యూటీఎఫ్ నేతలు దొంతంశెట్టి సతీష్, కదలి శ్రీనివాస్, కిలపర్తి శ్రీనివాసరావు, గుంటూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయండి

రాయవరం: వ్యవసాయ పనుల నిమిత్తం తొమ్మిది గంటల విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని మండలంలోని చెల్లూరు గ్రామానికి చెందిన చిన్నసన్నకారు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం త్రీ ఫేజ్ విద్యుత్‌ను రోజుకు తొమ్మిది గంటలు ఇస్తున్నప్పటికీ, స్థానికంగా ఉండే మరమ్మతుల కారణంగా తొమ్మిది గంటలు నిరంతరాయంగా సరఫరా చేయడం లేదన్నారు. దీని వలన మెరక చేల పనులు సాగడం లేదన్నారు. నీరు లేక పంటలు ఎండిపోతున్న పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. విద్యుత్ శాఖ అధికారులు తొమ్మిది గంటలు నిరంతరాయంగా 3ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ రామచంద్రపురం విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు రైతులు తెలిపారు.